ఏప్రిల్ ఫూల్

కొడవటిగంటి వెంకట సుబ్బయ్య

గుంటూరు జిల్లా తెనాలిలో 1893లో జన్మించారు. ప్రభుత్వ శాఖలో ఓవర్‌సీర్ వుద్యోగం చేశారు. అనేక కథలు రాశారు. టాల్‌స్టాయ్ కథలు పెక్కింటిని తెలుగులోకి అనువదించారు. ఆయనకు యోగ సాధనపై చాలా ఆసక్తి వుండేది. తర్వాత కాలంలో ఆయన అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఎప్పటికీ వారి జాడ దొరకలేదు. దీని రచనా కాలం 1921.

ఆణిముత్యాలు

హాస్టల్ విద్యార్థులందరిలోకీ విశ్వనాథంకన్న గడేకారు గాని పెద్దమనిషిగాని మరొకడు లేడు. అతనికి అఖండమైన తెలివితేటలున్నాయని ఉపాధ్యాయులంతా అంటారు. మరి మూడేళ్ళ నుంచీ ఎఫ్.ఏ. తరగతి తప్పుతున్నాడు. "ఎన్నడైనా పుస్తకం మొహం ఎలాంటిదో చూస్తేగా! తాజెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని, తాను చదవడు సరిగదా ఆ రాధాయిని కూడా చెడగొట్టుతున్నాడు" అని తెలుగు పండితుడు, కాలేజీ ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్ అయిన విలియం దొరకు తెలుగు నేర్పే సమయంలో అంటూ వస్తాడు.

"అవునవును. మేము చూచుచున్నాము" అని దొర.

దొరకు విశ్వనాథమంటే అమిత మంట. అతని అల్లరిని ఏమాత్రమూ ఆపలేకపోయిన అసమర్థత వల్ల కలిగిందా కోపం. ఎవరినో నలుగురిని పోగుచేసి తలుపులు గడియలు పెట్టి రోజూ పేకాట. దొరకు ఆచూకీ తెలిసి అకస్మాత్తుగా వచ్చి తలుపు తట్టితే వెంటనే దీపమారిపోతుంది. ఎక్కడివాళ్ళక్కడ గురకపెట్టుతుంటారు. తలుపులు పగిలేటంతపని అయినాక విశ్వనాథం పోపో పొమ్మని ఎవరో విద్యార్థి పేరు పెట్టి నానాతిట్లు తిట్టి మళ్ళీ గురక సాగిస్తాడు. ఇంకా కొంతసేపటికి దొరగారిని గుర్తించినట్లు హడావిడిగా లేచి తూలుకుంటూ, బట్ట సవరించుకుంటూ, నోటినిండా క్షమాపణలతో బయటికి వస్తాడు. విశ్వనాథం అల్లరివాడా? మరీ నమ్మకము లేక దొరగారు లోపలికి వచ్చి సోదా చేశాడా, చస్తే పేకముక్కలు కనపడవు!

పెద్ద జబ్బు చేసిందని తలనిండా ముసుగు పెట్టి పడుకుంటాడు విశ్వనాథం. భోజనానంతరం దొరగారు వచ్చి పరామర్శ చేసి ఇట్టే అవతలికి వెళ్ళగానే, విశ్వనాథం శాలువ ఒక మూలకు విసరి నీటుగా తలగుడ్డ చుట్టి ఇంత సెంటు పూసుకుని, రాధారావుతో గోడ దూకి నాటకానికి వెళ్ళుతాడు. మర్నాడు దొరగారికి ఈ సంగతి తెలిసి చూడవస్తే గది అంతా యూక్లిప్టస్ నూనె వాసన, మొఖంనిండా అమృతాంజనము, ఎర్రటి కళ్ళు, మాటాడితే ఆయాసము! "నా-కీపూట-గోధుంజావే-అన్నం-వద్దు-" అని దీనంగా దణ్ణాలు. పక్కన కంట నీరు పెట్టుకుంటూ రాధాయి! ఇదీ వరస.

ఇలాటివాణ్ణి ఏం చెయ్యాలో దొరగారికి బోధపడేది కాదు. చేతకాని కొద్దీ అతన్ని పట్టుకోవాలని ఆదుర్దా హెచ్చింది. ఒక చీకటి రాత్రి దొరగారు వసారాలో మంచము వేయించుకొని పండుకొన్నాడు. తెల్లవారు ఝామున మెళుకువ వచ్చి చూచేసరికి గాఢాంధకారము! ఆయన మంచము పెద్ద చీకటి మానికింద ఉన్నది. కాళ్ళ దిక్కున అంత దూరంలో తెల్లటి వ్యక్తి కనబడ్డది. దొర తల యెత్తి చూచాడు. ఆ వ్యక్తి మెల్లిగా సమీపించింది; నడిచి కాదు – గాలిలో తేలిపోతున్నట్టు, అది దగ్గిరికి వచ్చి నిలబడ్డది. భయంకర పిశాచ రూపం! దొర కెవ్వున కేక వేసి కళ్ళు మూసుకున్నాడు. మళ్ళీ కళ్ళు తెరిచేసరికి దయ్యం లేదు. ఎవరో పారిపోతున్న శబ్దం వినబడ్డది. ధైర్యం తెచ్చుకుని దొర కేకలు వేసుకుంటూ పోయి సరాసరి విశ్వనాథం గది చేరాడు. గది తాళం వేసి ఉన్నది. ఈలోగా జవానులు వచ్చారు. దొర హాస్టలంతా వెతికించాడు. విశ్వనాథం, రాధారావు– ఇద్దరూ లేరు. మర్నాడు విద్యార్థులందరి యెదుటా విచారించి నేరం నిర్ధారణ చేసి ఇద్దరికీ చెరి

రెండు రూపాయలూ జరిమానా విధించాడు. దయ్యం మాటమాత్రం ఏమీ రాలేదు. దొర తీర్పు చెప్పి, వాళ్ళను పంపివేస్తూ, "విశ్వనాథం, ఇంకొకరికి బుద్ధి చెప్పదగినయాడు నీకు వచ్చినది. కాని నీవింత తుంటరిగా సంచరించుచున్నందులకు నాకు చాల విచారముగా నున్నది. నీవు కళాశాల విడిచి ఇంటికి పోవుట చాల మంచిది. నిన్ను నేను ప్యాసు చేయను" అని కఠినంగా మందలించి, అతన్ని పంపివేసి, రాధారావును చాలా చివాట్లు పెట్టినాడు.

రాధారావు చిన్నవాడు, ఆకారంలో బాలికవలె ఉంటాడు. మెత్తనివాడు. అయితే ఇప్పుడిప్పుడు విశ్వనాథం ట్రెయినింగు వల్ల కొంత గడతేరినాడు. వాళ్ళిద్దరికీ పరమ మైత్రి. వార్డెను అన్న దుర్భాషలన్నీ రాధారావు వచ్చి చెప్పేసరికి విశ్వనాథానికి కళ్ళనీళ్ళు తిరిగినవి. ఆ రాత్రి వాళ్ళు పడుకునేసరికి కోడి కూసింది.

పరీక్షలు దగ్గిరికి వచ్చినవి. జరిమానా తగిలిన నాటినుంచీ విశ్వనాథం చర్య మారిపోయింది. ఒక్క తమాషా మాట గాని, ఒక్క పరిహాస చేష్ట గాని లేదు. ఎప్పుడూ పుస్తకంలో ముఖం పెట్టుకుని కూర్చునేవాడు. దొర కూడా మళ్ళీ అతని జోలికి వెళ్ళలేదు. అతనితో జోక్యం పెట్టుకోకపోవడమే మంచిదనుకొన్నాడు.

ఒకరోజు స్నేహితులిద్దరూ పుస్తకాలు ముందు వేసుకుని కూర్చున్నారు. విశ్వనాథానికి గంటకు ఒక పుట అయినా తిరగడంలేదు. రాధారావు ఎప్పటితీరున తదేక నిష్ఠతో చదువుకుంటున్నాడు. కొంతసేపటికి విశ్వనాథం చిటుక్కున గ్రంథం మూసి "రాధా, యిటు రా" అని, అతన్ని దగ్గిరికి తీసుకొని చెవిలో ఏమేమో చెప్పాడు. రాధారావు సిగ్గుపడి తల వంచుకుని చిరునవ్వు నవ్వాడు.

"ఏమంటావు?"

ప్రత్యుత్తరమియ్యకుండా నవ్వు మొగము పైకెత్తి రాధారావు మిత్రుని వంక చూశాడు. విశ్వనాథం అతని కళ్ళు ముద్దుపెట్టుకున్నాడు.

మర్నాడు ఏప్రిల్ మొదటి తేదీ. విద్యార్థులూ, ఉపాధ్యాయులూ పరీక్షల గొడవలో ఉన్నారు. ఆ రోజు సాయంకాలం ఆరుగంటల వేళ విశ్వనాథం గదిలో నుంచి ఇద్దరు విద్యార్థులు బయలుదేరి అక్కడక్కడ పదిమందిని చేర్చుకొని తెలుగు పండితుడి దగ్గిరికి వెళ్ళారు. వీళ్ళేదో పరీక్షల విషయం అడగవచ్చారనుకొని ఆయన వీళ్ళను చూడగానే "పొండి, పొండి, పొండి. నాకేమీ తెలియదు. మీకు పేపరిచ్చింది నేను కాను" అని గడబిడ చేశాడు.

"అది కాదండి శాస్తుర్లుగారూ! పరీక్ష సంగతి కాదు. మేము వేరే పనిమీద వచ్చాము."

"ఏమిటది?"

"మీకూ, మాకూ, అందరికీ అప్రతిష్ఠ వచ్చేరోజు వచ్చింది. విశ్వనాథం–"

"వాడి సంగతేనా? ఇక చెప్పనక్కరలేదు. ఏదో రావణా అల్లరి! దొంగతనంగా పేపర్లేమైనా కొట్టేశాడా?

నవ వసంత ఆగమ వేళలో...

ఇవాళ ప్రభాత సంధ్యలో
'పార్థివ' స్మృతి నుండి తేరుకొని
'వ్యయ' వైభవాన్ని స్మరిస్తూ
వసంత విహారం చేస్తున్నాను!
కాసిన్ని అక్షరాల్నీ దోసెడు చిరునవ్వుల్నీ
లాల్చీ జేబులో వేసుకొని
వసంత కవితా గానానికి బయల్దేరాను
పెరట్లోని వేపచెట్టు వెక్కిరింతగా దగ్గింది
ఇంటెనుక మామిడి చెట్టు ముసిముసిగా నవ్వుకొంది
లెక్క చెయ్యలేదు.. శుభ్రంగా అలికి ముగ్గుపెట్టిన
లోగిల్లోంచీ నడిచి వస్తున్నాను
కుండీలో సంపంగి విరబూయకుండానే
మూతి ముడేసుకుంది
చిగురు గూట్లోని కోయిల స్వరం వినిపించడం లేదు
దూరాన వేదిక మీది నుంచి హరిప్రసాద్ చౌరాసియా
వేణుగానం, బిస్మిల్లాఖాన్ షెహనాయి వాద్యం
ఒక్కటిగా కలిసి మధువులూరిస్తూంటే
మైమరిచిపోతూ జేబులు తడుముకున్నాను
అంతే!... అక్షరాలెప్పుడో జారుకున్నాయి!
"గతకాలంబు మేలు వర్తమానంబుకంటెన్" అన్న నన్నయను స్మరించనా?
"మంచి గతమున కొంచెమేనోయ్" అన్న గురజాడను ప్రేమించనా?
పార్థివైనా 'వ్యయ' అయినా పరమార్థం
'ప్రజాహితం' ఒక్కటే!
వసంతమైనా, చైత్రమైనా
సగటు హృదయ స్పందన ఒక్కటే!!

–సృజన

ఏం కర్మం! అయినా ఈ మధ్య చాలా బుద్ధిమంతు డైనాడోయ్!"

"అయ్యో శాస్త్రుర్లుగారూ! ఎంత వెర్రివారండీ మీరు! పేపర్లు దొరికితే మేము మీ దగ్గిరికి చెప్పడానికి వస్తామా? పైగా వాడు బుద్ధిమంతుడైనాడంటున్నారే. ఇవాళ వాడి చర్య వింటే ఏమంటారో!"

"మనమిక్కడ ఇలాగే మాట్లాడుతుంటాము. వాడు కాస్తా దాన్ని అవతలికి దాటేస్తాడు శాస్త్రుర్లుగారూ! మీరు త్వరగా రండి. ఎవరో పిల్లదాన్ని తెచ్చి గదిలో పెట్టాడు విశ్వనాథం!"

శాస్త్రుర్లుగారు తెలాతెలాపోయి చూడసాగినాడు.

"ఒరే, దొరగారికి తెలిస్తే మంచిదిరా" అన్నాడు ఒక విద్యార్థి.

"అవునండీ, మేష్టారూ! దొరకి చెప్పెయ్యండి" అని మరొకడన్నాడు.

అందరూ కలిసి గబగబా దొరగారి దగ్గిరికి వెళ్ళారు. కొంతసేపటిదాకా ఆయనకు అర్థంకాలేదు. హాస్టలులో ఇంతమంది విద్యార్థుల నడుమ ఇటువంటి పని జరుగుతుందా అని ఆయన నమ్మలేకపోయినాడు. పిల్లలంతా గట్టిగా నొక్కి చెప్పారు. "ఆ చిన్నది లోపలికి వెళ్ళుతూ ఉండగా కళ్ళారా నేను చూశాను" అని ఒకడన్నాడు.

వెంటనే దొర బయలుదేరి వచ్చాడు. లాంతరులతో జవానులు వెంట వచ్చారు. హాస్టలులో ఉన్న విద్యార్థు లంతా పోగయినారు. నిశ్శబ్దంగా ఉండండని దొర కాలిజోడు విడిచి విశ్వనాథం గది సమీపించాడు. లోపలి నుంచి అస్పష్టంగా ఏదో గుసగుస వినబడ్డది. ఒకసారి మట్టెల చప్పుడయింది. దొర పక్కనున్న విద్యార్థిని పిలవమని సంజ్ఞ చేశాడు.

"విశ్వనాథం!"

గుసగుస ఆగిపోయింది.

"విశ్వనాథం!"

"ఎవరు?"

"నేను బుచ్చిరామయ్యను."

"ఎందుకు?"

"పని వుంది."

"ఇప్పుడు వల్లగాదు, పో!"

"పని వుంది. ఒక్కసారి తియ్యి. మళ్ళీ ఇప్పుడే వేసుకుందువుగాని."

"అట్టే మాటాడావంటే నీ ముడిముక్కు ఊడ గొడ్తాను!"

"దొరగారు తియ్యమంటున్నారు."

"నీకూ దొరగారికీ ఏమీ పనిలేదు. అవతల పో!"

"విశ్వనాథం, ఓపెన్ ది డోర్ ప్లీజ్" అని దొర ఉచ్చైస్స్వరంతో అన్నాడు.

నిశ్శబ్దము.

"ఏమి విశ్వనాథం?"

విశ్వనాథం తలుపు కొంచెం తెరచి నేర్పుగా బయటికి వచ్చి తలుపు మూసినాడు. దొర తీక్షణంగా చూస్తూ, "ఏమి చేయుచున్నావు?" అని అడిగాడు.

"పూజ చేసుకొంటున్నాను" అని అతను తొణకకుండా జవాబు చెప్పాడు.

"లోపల ఎవరున్నారు?"

"ఎవరూ లేరు."

"అక్కడ లెమ్ము. నేను లోపలకు వెళ్ళవలయును."

విశ్వనాథం ఒక్కపిసరైనా కదలక అతి వినయముతో "మీరు లోపలికి రావడానికి వీలులేదు" అన్నాడు.

"ఏమి!"

విద్యార్థియెవడూ ఇలా పలుకుతాడని దొర ఎన్నడూ

సమతుల్యం

గమ్యం తప్పని గతిలో
గ్రహాన్ని చుట్టివేసి
శూన్యంలో పతంగమై
జీవంలేని రెక్కపై
జీవుడు వ్రేలాడితే
వర్థమాన శాస్త్రీయ పరిజ్ఞానమే
పాతాళపు పరిశోధనలు
సముద్ర గర్భ పరిశీలనలు
క్రోమోజోముల మార్పులు
క్లోనింగ్ ఉత్పత్తులన్నీ
విజయోత్సాహ సాధనలే
కానీ...
అలల అలజడులు
అవని ప్రకంపనలు
ఎయిడ్స్ తెగుళ్ళతో
ఎప్పుడూ... భయబీభత్సపు బ్రతుకులే
పెరుగుడు విరుగుడుల సమతుల్యాలే
ఏది ఏమైనా... ఫలితం ఒకటే
నాడూ.. నేడూ...
ఏదోలా నేలపై కూలడమే.

—పూట్ల భద్రయ్య

కలలో కూడా అనుకోలేదు.

"నేను పూజ చేసుకుంటున్నాను" అని విశ్వనాథం మృదువుగా అన్నాడు.

"ఏమి, మేము నీ పూజ చూడగూడదా? అట్లయిన నీ పూజ వస్తువులన్నియు దాచిపెట్టు, నేను వచ్చెదను."

గంభీర స్వరముతో విశ్వనాథం ఇలా అన్నాడు.

"మిష్టర్ విలియం! ఈ రాత్రి మీరు ఏదో దురుద్దేశముతో ఇంతమందిని వెంటబెట్టుకొని నా గది పరీక్ష చెయ్యడానికి రావడం ఒక తప్పు. వచ్చి నా పూజ చెడగొట్టడం రెండో తప్పు. సగం పూజలో నా దేవతార్చన అవతలపెట్టమని చెప్పడం మూడు. ఇది అన్నిటికంటె గొప్ప అపరాధం! మీ పాశ్చాత్యులు వెయ్యేళ్లు తలకిందుగా తపస్సు చేసినా మా హిందువుల ధర్మం మీకు తెలియదు. నేను చాలా సహించాను. కనుక దయచేసి ఇక వెళ్ళండి!"

దొరగారి ముఖం తరిగిన కందగడ్డవలె అయింది. కొంచెంసేపు ఊరుకుండి దొర శాస్తుర్లుగారిని చూసి "మీరు వెళ్ళి చూడండి" అన్నాడు. విశ్వనాథం చికాకు పడ్డాడు.

శాస్తుర్లుగారికి సంకటం వచ్చింది. తాను వెళ్ళి చూడకపోతే దొర ఊరుకోడు. వెళ్ళి చూస్తే విశ్వనాథం సంగతి బయట బడుతుంది. తర్వాత తన పని ఏమవుతుందో పరమాత్ముడికే ఎరుక! విశ్వనాథం మాట తలచుకుంటే ఆయనకు హడలు.

చేసేది లేక తెలుగు శాస్తుర్లు గారు లోపలికి వెళ్ళాడు. విశ్వనాథం తల వంచుకు ఊరుకున్నాడు. శాస్తుర్లు గారికి లోపల ఏ దేవతార్చనా కనబడలేదు. ఎవరూ కనబడలేదు. గుండెలు దడదడలాడుతూ ఉండగా ఆయన బయటికి వచ్చి ఈ మాట చెప్పినాడు. దొర విశ్వనాథం వంక చూచాడు. పట్టుబడ్డ అపరాధి వలె అతను తల యెత్తలేదు. రెండు తలుపులూ తెరిచి దొర లోపల ప్రవేశించాడు. ఒకరి మీద ఒకరెక్కి విద్యార్థులు వింత చూస్తున్నారు. ఎవ్వరూ సందడి చెయ్యలేదు.

గది అంతా యెప్పటిరీతిగా ఉంది. ఎక్కడి పుస్తకాలక్కడ, ఎక్కడ విడిచిన బట్టలక్కడ. పడుకొన్నవాడు లేచాడు కాబోలు, మంచము మీద దుప్పటి కిందికి జారి ఉన్నది. ఎక్కడా ఎవ్వరూ కనబడలేదు.

దొర చటుక్కున వెళ్ళి మంచం మీద దుప్పటి లాగివేశాడు. వెంటనే చికాకుపడుతున్న పదహారేళ్ళ కుర్రది మంచం కింది నుంచి బయటికి వచ్చి ముఖాన పైటచాటు వేసుకుని ఒక మూలకు వెళ్ళి నిలవబడ్డది.

పటపటా పళ్ళు కొరుకుతూ దొర ఇవతలికి వచ్చి విశ్వనాథాన్ని అన్న మాటలు ఇన్ని అన్ని కావు. బిక్కపోయిన ముఖంతో అతను అన్నింటికీ మాటాడకుండా ఊరుకున్నాడు. దొరకు శాంతం రాలేదు. ఆయన బ్రహ్మచారి. బైబిలులో నుంచి అనేక వాక్యాలు అప్పజెప్పి విద్యార్థుల కందరికీ పెద్దపెట్టున నీతి బోధించాడు. ఆయనకు అప్పటికీ కోపం తగ్గలేదు. మొహం నెత్తురు కంద అయింది. చివరకు దొర ఆ చిన్నదాని వంక తిరిగి "అమ్మాయీ, ఇంత నీచ కార్యము చేయుటకు ఈ వయస్సున నీకింత సాహసమా? నీ వెవరు? ఇక్కడికి ఎట్లు వచ్చినావు?" అన్నాడు.

ఆ కుర్రది దుఃఖం ఆపుకొంటూ "మీ కోసమే వస్తూవుంటే ఈయనగారు అడ్డుపడ్డాడు" అని మృదు మధుర స్వరంతో ముఖంలో మార్పు లేకుండా అన్నది.

విశ్వనాథం పక్కున నవ్వాడు. విద్యార్థులంతా కరతాళ ధ్వనులతో హాస్యం చేశారు. దొర మొహాన నెత్తురు చుక్క లేదు. ఆయనకేమీ బోధపడలేదు. కాని అంతలోనే ముఖం క్రోధఘూర్ణితమై దొర విద్యార్థుల వంక తిరిగి "మీరు అందరు వట్టి ఫూల్సు!" అని అరిచినాడు. అంతా ఊరుకున్నారు.

విశ్వనాథం సరసంగా నవ్వుతూ, "మిష్టర్ విలియం! శాంతించండి" అని లోపలికి వెళ్ళి సిగ్గుతో పెనుగులాడుతున్న చిన్నదాన్ని తీసుకువచ్చి, "మీరు ఈ పిల్ల నెరుగుదురు. తిన్నగా చూడండి!" అని బలవంతంగా ఆమె ముఖం పైకెత్తి దొరగారికి చూపాడు. పరిహాసము తాండవిస్తున్న ఆమె కళ్ళల్లో దొర రాధారావును గుర్తించాడు. అందరూ రాధాయి, రాధాయి అని కేకలు వేశారు.

"ఈ రోజున మీరు చేసిన చర్యకు ఇందరిలో మీకంటె ఫూల్ లేడని తోస్తున్నది" అని విశ్వనాథం దొరతో నిర్భయంగా అన్నాడు.

ఒక్క క్షణము ఎవరూ మాటాడలేదు. తర్వాత దొర ప్రసన్న ముఖంతో విశ్వనాథానికి షేక్‌హ్యాండు ఇచ్చి, "నీ చమత్కారమునకు నిజముగా సంతోషించినాను. నీవు చాలా తెలివి కలవాడవు" అని, అందరికీ గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోయినాడు.

అంతా నవ్వారు. కాని తెలుగు శాస్తుర్లుగారు ఇంకా గడగడలాడుతున్నాడు. విశ్వనాథం ఆయన్ను చూచి "శాస్తుర్లుగారూ, దొరగారే అనుకున్నా గాని ఆయనకన్నా పెద్ద ఫూల్ అండి మీరు!" అని పరిహాసం చేశాడు. ■